

**క**న్ను అదిరింది!

కుడి కన్ను!

శుభ శకునం!

మొన్న చదివిన వార ఫలితంలో "వారాంతంలో వృత్తిలో పైకిపోయే సూచనలు, ఆ సందర్భంలో అల్పంగా ధన వ్యయం" అని వ్రాసి ఉంది.

అన్నీ కలిసి వస్తున్నాయి.

మొన్న మామయ్య కూడా అన్నాడు, నా జాతకంలో ముప్ఫయ్యేళ్లవరకూ శని ఉందిట. ఆ తరవాత ఒక్కసారిగా దశ తిరిగి మహోజ్జ్వలంగా వెలిగిపోతానుట!

ఇవాళే నా పుట్టిన రోజు! ముప్ఫై నిండిపోతాయి. శని వదిలిపోతుంది.

కన్ను మళ్లీ అదిరింది. కుడికన్ను!

పుట్టిన రోజు అనుకోవటమే! పుట్టిన రోజులు చేసుకొనేలావే ఉంది బ్రతుకు!

ఫస్ట్ తారీఖున కనిపిస్తాయి మూడు వందల రూపాయలు... మూడు వందలు... మూడు ... వందలు మార్చే వరకే ఆ సంతృప్తి!

ఒక్కొక్క వంద మారుస్తూంటేఎలాకరిగిపోతుందో కూడా తెలియకుండా హరించుకు పోతుంది.

నిత్యావసరాలు గడిచి, పిల్లల్ని బళ్లలో చదివించే సరికే గగనమయిపోతూంది.

ఇంక పుట్టిన రోజులూ, పండగలూ కూడా ఎక్కడ? ప్రమోషన్ రావాలి . . . ప్రమోషన్!

అన్ని అర్హతలు ఉన్నాయి నాకు. బి. ఎ. పాసయ్యాను. డిపార్ట్‌మెంటల్ టెస్ట్స్ పాసయ్యాను. ఆ వాసుగాడు — అదే. ఆ వాసుదేవరావుగాడు — వాడి కున్నన్ని అర్హతలు నాకూ ఉన్నాయి. ఎటొచ్చీ వాడు నాకు సీనియర్. అందుకే వాడు సూపరింటెండెంట్, నేను మామూలు గుమాస్తాని.

వాడు లేకుండాపోతే, అంటే వాడెక్కడి కయినా ట్రాన్స్‌ఫరయితే నేనే సూపరింటెండెంట్ నవుతాను. కానీ మాది ప్రైవేట్ కంపెనీ.

ట్రాన్స్‌ఫర్లు కూడా ఎక్కడ?

వాడు లేకుండా ఎక్కడికి పోతాడు? తొమ్మిదిన్నరకల్లా సీట్‌లో తగలడతాడు, అందరికన్న ముందుగా!

అరే! అదేమిటి? వాడి సీట్ ఖాళీగా ఉందే! రాలేదేం? ఎందుకు రాలేదు?

కన్ను అదిరింది! కుడి కన్ను.

వాసుగాడి కింకేదయినా మంచి ఉద్యోగం దొరికిందా? ఎక్కడికయినా వెళ్లిపోయాడా?

ఇంక నేను సూపరింటెండెంట్ నవుతానా?

ఋతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన దేవీపిల్సు వాడండి
SEENU & CO., MADRAS-21
పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది
ప్రకటన G. O. Ms. No. 1121 క్రింద అనుమతించబడినది

మృదువైన, ఆరోగ్యవంతమైన
పట్టువంటి మెత్తటి జుట్టుకు....
కేశవర్ధిని
వాడండి



30 ఏండ్ల పైబడి ఇంటింటా పేరు పొందినది
మెత్తటి, సువాసన గల జుట్టుకు కేశవర్ధిని షాంపూ వాడండి.
కేశవర్ధిని ప్రాడక్ట్స్
మద్రాసు-14
KVP-101

భలే! కానీ ఆ వాసుగాడి కింకా మంచి ఉద్యోగం! ఛ! ఛ! ఈర్ష్య పడకూడదు. విశాల హృదయం కలిగి ఉండాలి, విశాల హృదయం!

వాసుదేవరావు కింకా మంచి ఉద్యోగం వచ్చుగాక! వాడు సుఖపడుగాక!

నాకు సూపరింటెండెంట్ ఉద్యోగం చాలు. అంత కన్న ఆశపోతుని కాను. తృప్తి పడాలి. నాకు ఈ ఉద్యోగం చాలు.

ఇంతకూ వాసుదేవ్‌కి మంచి ఉద్యోగం దొరికిందా? ఫ్యాన్ అప్పలస్వామి చుట్ట కాల్చుకుంటూ నించున్నాడు దర్జాగా.

వాడి దర్జా మండిపోను. . . చేసేది బంట్రోతు ఉద్యోగమయినా లోకానికి రాజులా నించుంటాడు. జగత్తుకి అధిపతిలా నవ్వుతాడు! తన కలలు సమస్యలే లేనట్టు నిర్లక్ష్యంగా బతికేస్తాడు.

నా మనసులోలా వాడి మనసులో తర్జన భర్జనలు చెలరేగవా?

ఇంక్రిమెంట్ సమస్యలు వాడికి లేవా?

పిల్లల్ని బళ్ళో వెయ్యక్కర్లేదా?

పెళ్ళాం కొత్తచీర కొనమని పేచీ పెట్టదా? వాడెలా నవ్వ గలుగుతున్నాడు అలా? నే నెందుకు నవ్వలేకపోతున్నాను?

సీట్లో కూర్చున్నాను. కాదు, కూలబడ్డాను. ఫైళ్ళు! ఫైళ్ళు! . . .

ఎత్తుగా . . . తీస్తూన్న కొద్దీ పెరుగుతూన్న.. ఈ ఫైళ్ళన్నింటికీ ఒక్క అగ్గిపుల్ల అంటిస్తే . . .

డిటెక్టివ్ నవలల్లో లాగ ఆ మేనేజర్ని షూట్‌చేసి ఆ మేనేజర్ కుర్చీలో కూర్చుంటే . . .

ఆఫీసంతా దిగ్భ్రాంతితో చూస్తుంది.

అప్పుడే వాసుదేవరావు నా ముందు చేతులు కట్టుకుని . . . ఛ! . . . వెధవాలోచనలు! మనసు కోతి లాంటిది, ఊరుకోదు. పరుగులు . . . మనస్సా, మనస్సా . . . మనస్సా . . . ప్లీజ్ . . . తరవాత పగటి కలలు కందువుగాని కాస్సేపు ఫైళ్ళమీద నిలుద్దూ!

మేనేజర్ గిరీ మాట దేవుడెరుగు? మేనేజర్ దగ్గిర అక్షింతలు పడతాయి.

పది . . . పదిన్నర . . .

ఇంకా వాసుదేవ్ రాడేమిటి చెప్మా!

కదిపి చూద్దామా! ఇన్‌ఫర్‌మేషన్ డిపార్ట్‌మెంట్ గాడు మూర్తినే అడగాలి.

వాడికి తెలీని సంగతి ఉండదు. ఎక్కడెక్కడివి పోగేస్తాడు. పోగేసిన వాటిని రక్తిగా వర్ణిస్తాడు. అందుకే ఇన్‌ఫర్‌మేషన్ డిపార్ట్‌మెంట్‌గాడనటం!

"మూర్తిగారూ! మన సూపరింటెండెంట్‌గారు ఇంకా రాలేదేం?"

ఎవరు మాట్లాడిస్తారా, ఎప్పుడు గడగడా లెక్చర్ దంచుదామా అని ఎదురుచూసే వాగుడుకాయల్లో మూర్తి మొదటివాడు. నా ప్రశ్న వింటూనే అందుకున్నాడు.

"మన వాసుదేవరావుగారికి జ్వరమండీ! తొమ్మిదిన్నరకే వచ్చి కూచునేవాడు! మనలో మనమాట! అంత యంత్రంలా పనిచేస్తే మన శరీరాలు ఆగగలవుటండీ! ఇదేదైనా యంత్రమా! కాస్త కూస్త జ్వర మయితే వాసుదేవరావుగారు లెక్కపెట్టేవాడేనా?

అలాగే. పిచ్చి పాలేవాడు కాదుటండీ! అసలు పిన్ననే పంతగా ఉన్నాడు మనిషి. విశ్రాంతి తీసుకోండయ్యా అంటే వింటేనా? ఏరా వంటికి తెచ్చుకున్నాక ఇప్పుడిక విధిలేక సెలవు పెట్టాడు. రేపటికొస్తాడేమో లెండి. ఏమాత్రం తగ్గినా రాక మానడు." ఏకవచన బహువచనాలు కలిపి మాట్లాడెయ్యటం మూర్తి అల వాటు. తెచ్చిపెట్టుకున్న సంస్కారంతో బహువచనంలో మాట్లాడబోతాడు. సహజ సంస్కారం ఏక వచనంలోకి దింపేస్తుంది.

ఆ మరునాడు కూడా రాలేదు వాసుదేవరావు.

కన్ను మళ్లీ అదిరింది! కుడికన్ను!

తప్పకుండా ఏదో శుభం జరగాలి!

వారాంతంలో ప్రమోషన్!

ఎలా సంభవం?

వాసుదేవరావు జబ్బు. ఛా! పాడు ఆలోచనలు! ఒకసారి చూసిరావాలి. పాయంత్రం చూసిరావాలి.

వాసుదేవరావుకి నయం కావాలనే కోరుకుంటున్నాను నేను.

అతడు చచ్చిపోవాలని, ఆ ఉద్యోగం నాకు రావాలని కోరుకుంటానా? అంత స్వార్థపరుణ్ణా?

కాని ఎందుకో నాకు . . .

సరేలే చూసివద్దాం.

ఒక్క రోజులోనే ఇంత నీరస పడిపోయాడేమిటి వాసుదేవరావు?

ఎముకల పోగైపోయాడు! ఎప్పుడూ కాస్త బక్క పలచనివాడే అనుకో! కానీ, ఇప్పుడు బొత్తిగా అస్థి పంజరమై పోయాడు.

ఆ ముఖం ఏమి టలా ఉంది? ప్రేతకళ వచ్చేసింది. అవును, ఏ కోశానా కళ్లలో జీవం లేదు. భగవంతుడా! బ్రతకాలి. వాసుదేవరావు బ్రతకాలి. కానీ ఆముఖంలో ప్రేతకళ. అది ప్రేతకళే! ఆ కేశవస్వామి చనిపోబోయే ముందు ముఖం అచ్చు ఇలానే ఉండేది. ఇతను బ్రతకడు. రూఢిగా బ్రతకడు! పాపం! ఇతని భార్యా పిల్లలూ ఏమైపోవాలి? బ్రతికితే బాగుండును!

మన చేతుల్లో లేనిదానికేం చేస్తాం! విధి కెవ రెదురీదగలరు?

"వాసుదేవరావుగారూ! అధైర్యపడకండి. వ్యాధి ఉధృతంగా ఉన్నా తగ్గిపోతుంది. పరవాలేదు."

"నా కధైర్యమేముందండీ! పెద్ద ఉధృతం గానూ లేదు! ఇంతవరకెప్పుడూ రోగం, నొప్పీ లేదు. మొన్న వానలో తడిశాను. పెద్దవాడినయిపోతున్నాను. వెనకటి శక్తి లేదు. కొద్దిగా నలవరం, అంతే!"

ఆహా! వాసుదేవరావు ఎంత గొప్పవాడు? నా కింత వరకూ తెలియనే తెలియదు! మృత్యు ముఖంలో నిలబడి కూడా ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నాడు? కర్మయోగి! మహానుభావుడు!

"మీ రెండో అమ్మాయి కింకా పెళ్లికాలేదు కదండీ!"

"ఏదండీ! ఇంకా పెద్దమ్మాయి పెళ్లికి చేసిన అప్పు తీరనేలేదు! అయినా దాని పెళ్లి కిప్పుడేం తొందర! ఇంకా చదువుకొంటూందిగా! బి.యస్.సి. అయ్యాక చూద్దాం!"

"ప్చ్! అన్నీ మనం అనుకొన్నవి అనుకొన్నట్లు జరగవు గదా!"

"ఇప్పు డేమయిందండీ!"

*ప్రతివ్యక్తి మానసికంగా జబ్బు మనిషి. తాను జీవితంలో ఆశించినని పొందలేనపుడు, అనుభవించ లేనప్పుడు ఆ జబ్బు తిరగబెడుతూం టుంది. తీరని కోర్కెలపై చిరు వెలుగు ప్రసరించే శకునాలే, కాలం కలసిరానపుడు చిమ్మచీకటిని వర్షిస్తాయి.*

"మీకిలా అర్థాంతంగా జ్వరం ముంచుకొస్తుందని అనుకున్నామా?"

"జ్వరానికేముందండీ! అదే తగ్గిపోతుంది."

"తగ్గిపోవాలనే మనసారా దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను."

నా కంఠం గద్గదమయిపోయింది. నా కళ్లలో నీళ్లాపుకోవటం నా తరం కాలేదు

నన్ను చూస్తూ పకపక నవ్వేశాడు వాసుదేవరావు. "ఎంత అమాయకులండీ మీరు!" అన్నాడు పైగా.

నా కుడికన్ను అదురుతూనే ఉంది. అదురు ఇంకా ఎక్కువైంది.

వాసుదేవరావు జ్వరమూ ఎక్కువయింది.

మళ్లీ వెళ్లాను చూడటానికి. జ్వరం చాలా తీవ్రంగా ఉంది.

ముఖంలో ప్రేత కళ బాగా స్పష్టంగా కనిపిస్తూంది.

"వెధవ జ్వరం! ఇన్నాళ్లు నట్టే పీడిస్తూందేమిటండీ!" జాలిగా అన్నాడు.

కదిలిపోయాను. ఎంతైనా మనిషి పుట్టుక పుట్టాక ఆ స్థితిలో జాలి కలగకుండా ఉంటుందా?

"తగ్గిపోతుంది — తగ్గిపోతుంది."

ఓదార్చాను. అంతకంటె చెయ్యగలిగిందేముంది!

"తగ్గిపోతుంది లెండి! డాక్టరు అదే చెప్పాడు. అయినా యంత్రంలా పనిచెయ్యటం అలవాటయి పోయి మంచంలో పడుకోవాలంటే విసుగొస్తుంది."

డాక్టరూ అదే చెప్పాడా? అవును! డాక్టర్లు అలాగే చెబుతారు. అది వాళ్ల వృత్తి ధర్మం. ప్రాణం పోతున్న సమయంలో కూడా ఏం భయంలేదనే అంటాడు డాక్టర్. కొనఊపిరి ఉన్నంతవరకు రోగికి ఆత్మ విశ్వాసం కలిగిస్తూనే ఉండాలి.

"మీకు ముగ్గురమ్మాయిలూ, ఇద్దరు కొడుకులూ కదూ!"

"అవునండి."

"ఇద్దరమ్మాయిలకి పెళ్లిళ్లు కావాలి."

"అవునండి,"

"అబ్బాయిల చదువులు పూర్తి అయినట్లేనా?"

"పూర్తిదాకా ఎక్కడండీ? అమ్మాయిల తరవాత పుట్టారు అబ్బాయిలు. పెద్దవాడు పి. యు. సి. పూర్తి చేశాడు. బి. ఇ. లో సీట్‌కోసం ప్రయత్నిస్తున్నాను. చిన్నవాడింకా ఎనిమిదోక్లాస్‌లోనే ఉన్నాడు."

"పాపం!"

"బాధపడవలసిందేముందిలెండి. ఇంకొక్క అయిదేళ్లు కష్టపడితే పెద్దవాడు చేతికంది వస్తాడు. మిగిలిన బాధ్యతలన్నీ వాడే భరిస్తాడు."

"మీ లైఫ్ ఇన్సూరెన్సు, ప్రావిడెంట్ ఫండూ ఉందిగా! అది మీ వాడి చదువుకి ఆదుకొంటుంది."

"ఇన్సూరెన్సు, ప్రావిడెంట్‌ఫండ్ ఇప్పుడెలా వస్తాయండీ! ఎలాగో నా జీతంలోటే తంటాలు పడాలి."

మళ్లీ కన్ను అదిరింది. కుడికన్ను!

లాభంలేదు! ఇతను బ్రతకడు! అయ్యో, పాపం! బ్రతుకుమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు! పిల్లలు! పక్కన వాసుదేవరావు చెయ్యి పట్టుకున్నాను.

"వాసుదేవరావుగారూ! మీ రెండో అమ్మాయి పెళ్లి బాధ్యత నాది. నేనే ఆ పెళ్లి చేయిస్తాను."

"అదేమిటండీ! ఇప్పు డీ మాటలన్నీ ఎందుకు?"

"అహ! అలా మీ చేతిలో చెయ్యి వెయ్యాల్సిందే. లేకపోతే నాకు మనశ్శాంతి ఉండదు."

ఇంచుమించు బలవంతంగానే రావుగారి చేతిలో చెయ్యి వేశాను.

ఆయన ముఖం వికసించవలసింది. "మీ రెంత మంచివారూ?" అనవలసింది.

"మీ ఋణం వచ్చే జన్మలో అయినా తీర్చుకుంటాను" అని నొచ్చుకోవలసింది.

అదేంలేదు సరికదా, నేనేదో వెర్రివాడినయినట్లు నన్ను చూసి నిరసనగా నవ్వాడు.

"ఎక్కడో చాదస్తం మీది!" అన్నాడు తేలిగ్గా.

నా మనస్సు చివుక్కు మనక పోలేదు. కానీ, ఇలాంటి వాటి నన్నింటినీ పట్టించుకోకూడదు. వాళ్లేదో పొగుడుతారని ఆశించి చెయ్యకూడదు. సహాయం చెయ్యడంలో మనకు ఆనందం ఉంది. కనక చేస్తాం! అంతే!

మాటయితే ఇచ్చాను. కానీ ఈ రోజుల్లో ఒక ఆడపిల్ల పెళ్లి చెయ్యటం మాటలా? చెయ్యగలనా? తప్పదు. ఎంత కష్టమయినా సరే ఇచ్చిన మాట నిలుపుకోవాలి. పాపం, ఆధారం నశించిన ఆ కుటుంబానికి ఈమాత్రం అండగా నిలబడాలి. సూపరింటెండెంట్ అయితే ఆరు వందలయినా వస్తాయి. అందులో రెండు వందలయినా బాంక్‌లో వేస్తే ఆ పిల్లకి పెళ్లయిపోతుంది.

రెండు వందలు బాంక్‌లో వెయ్యగలనా? బూట్స్ పాడయిపోయాయి. కొత్త బూట్స్ కొనుక్కోవాలి.. సైకిల్ పాడయిపోయింది. రిపేర్ చేయించుకోవాలి. వెధవ రిపేర్లు. కొత్త సైకిల్ కొనుక్కుంటే . . . సైకిలెందుకూ? మోటార్ సైకిల్ కొనుక్కుంటే ... దర్జాకి దర్జా . . . సౌఖ్యానికి సౌఖ్యం. మోటార్ సైకిలంటే మాటలా? సెకండ్ హాండ్‌ది కొన్నా అధమం మూడువేలుండాలి. మూడు వేలు పోగు చెయ్యాలంటే ఎంతకాలం పడుతుందో? ఇంటిది ఒక్క ముత్యాల గొలుసు కావాలని గోల పెడుతూంది. మూడు వందల్లో వస్తుందేమో! పాపం! ఒక్కటి కొనిస్తే . . . ? పెళ్లిలో పెట్టిన నానుతాడు తప్ప మళ్లీ ఒక్క నగ కొనలేదు. ఎంత ముచ్చపోతుందో? వెధవ ఖర్చులు. మరి ఆ పిల్ల పెళ్లి! వాగ్దానం చేసేశానే! ఫరవాలేదు. మొదటి రెండు మూడు నెలలూ కాస్త ఒడిదుడుకులు. ఆ తరవాత కాస్త కాస్త వెయ్యా కూడదీసుకుని కాస్త కాస్త బాంక్‌లో వేసి పెళ్లి చేసెయ్యొచ్చు. మరి మోటార్ సైకిల్! అది కొంటాను. మోటార్ సైకిల్ కొనాలంటే రెండు వందలు

## సి. ఆనందారామం

బాంక్‌లో వెయ్యటం పడదేమో! ఆఫీస్‌లో అప్లై చేస్తే లోన్ ఇస్తారు. కానీ, నెలనెలా కట్టుకోవాలి. ఇంక బాంక్‌లో ఎలా వెయ్యటం? పోనీ, ఒక వంద లోన్‌కి కట్టి మరో వంద బాంక్‌లో పడేస్తే సరి! పెళ్లికి మరో ఏడాది ఆలస్యమవుతుంది. పరవాలేదు. కాస్త వ్యవధి ఉండటమే మంచిది. నాలుగు పక్కలకీ తిరిగి బాగా మంచి సంబంధం చూసుకోవచ్చు. బాగా విచారిస్తే అంతగా కట్నం ఇచ్చుకో నక్కర్లేకుండానే మంచి సంబంధమూ దొరకచ్చు. . .

కానీ నెలనెలా రెండు వందలు పోతే ఇంట్లో మళ్లీ ఎప్పటిలా కటకటలాడవలిసిందే! పరవాలేదు— తప్పదు. పాటి మనిషికి ఆమాత్రం సాయపడకపోతే ఎలా? ప్రతి మనిషి తన స్వార్థం తను చూసుకుంటే సమాజం గతేం కావాలి?

"సొంతలాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడవోయ్!" అని కదూ మహాకవి గురజాడ ప్రబోధం! ఎక్కడో నాలాంటి ఒక రిద్దరయినా ఆ ఆదర్శాన్ని అనుసరించే వాళ్ళుండబట్టే దేశం ఇలాగైనా ఉంది!

కుడికన్ను అదిరింది.

అదరటమే కాదు! మండుతూంది.

మండటమేకాదు, నీళ్ళ కారుతూంది.

రాత్రి సినిమా చూశానుకదూ! అందుకేమో! వేడిచేసిందేమో, అదే పోతుంది.

కన్ను బాగా అదురుతూంది. నీళ్ళ కూడా బాగానే కారుతున్నాయి. కన్ను అదురుతూంటే మనస్సుకే హాయిగానే ఉంది. కానీ మండుతూంటే మాత్రం భరించలేకపోతున్నాను.

పోనీ, ఒక్కసారి డాక్టర్ దగ్గిరికి వెళ్ళి కాస్త ఆర్జిరాయిల్ వేయించుకుంటే! కొంపదీసి అదరటం ఆగిపోదు కదా! ఎందు కాగుతుంది? పోనీ, వెళితే సరి! ఈ డాక్టర్ పరీక్ష మహా యాతన. ఈ డాక్టర్లు లేని రోగాలు కనిపెట్టి వైద్యంచేసి, కొత్త రోగం తెచ్చిపెడతారు. ఆ రోగం వదుల్చుకొనేసరికి మన రోగం అదే వదిలిపోతుంది.

"కనుగుడ్డుపైన పొరలు లేచాయండీ! మీరు రెండు రోజులు హాస్పిటల్‌లో ఉంటే పరీక్షించి ఆపరేషన్ చెయ్యాలో, అక్కర్లేదో చెబుతాను."

యాంత్రికంగా అనేసి మరో రోగిని పిలవమన్నాడు డాక్టర్, వెళ్లిపొమ్మన్నట్లు నా వంకచూస్తూ. గుండెల్లో రాయి పడింది! రెండు రోజులు హాస్పిటల్‌లో . . . ఆ తరవాత ఆపరేషన్ . . .

ఛ! ఛ! ఆపరేషన్ అవసరముండదు. బహుశా తగ్గిపోతుంది. కానీ రెండు రోజులు హాస్పిటల్లో ఉంటే వాసుదేవరావుని చూసేదెట్లా? నేను హాస్పిటల్ నుంచి వచ్చేసరికి క్షేమంగా ఉంటాడో? ఉండడో? సమయానికి నేను దగ్గిరుంటే కుటుంబానికి ఏదైనా అవసరమయితే సాయపడచ్చును.

మంచం మీద రోజు గడవటం లేదు. సూపరింటెండెంట్ అయితే ప్రతివాడూ తనతో స్నేహం చెయ్యాలని చూస్తారు. అందరికీ లోకువివ్వెయ్యకూడదు. చాలా డిగ్నిఫైడ్‌గా ఉండాలి. నా హోదా నేను కాపాడుకోవాలి.

ఈ డాక్టర్ ఏం చెపుతాడో? త్వరగా తెమిలిస్తే బాగుండును!

"ఒక్కసారిగా ఇంత ముంచుకురావటం ఆశ్చర్యంగానే ఉంది. ఇంతకుముందు ఈ కన్ను మీకేం బాధ కలిగించలేదా?"

కన్ను పరీక్షచేస్తూ అన్నాడు డాక్టర్.

"బాదేం లేదండీ! కొద్దిగా అదిరింది. అంతే!"

"కొద్దిగానా?"

"కొద్దిగా . . . అంటే . . . బాగానే! ..."

"మరి, అంత బాగా అదురుతున్నప్పుడు అప్పుడే ఎందుకు రాలేదు హాస్పిటల్‌కి?"

విసుగ్గా అన్నాడు డాక్టర్.

"కన్ను అదిరితే హాస్పిటల్‌కు రావడమెందుకండీ! కుడి కన్ను! శుభ శకునం!"

"మీరూ మీ శకునాలూ! ఒక్కసారి అదిరితే శుభశకునం కావచ్చు. అదేపనిగా విపరీతంగా అదురుతూంటే హాస్పిటల్‌కు రావద్దుటండీ! ఇప్పుడు ఆపరేషన్ చేస్తే తప్ప వీల్లేదు!"

"ఆపరేషనా?"

గుండె ఝల్లుమంది. ఇదేమిటి? శుభమా అంటూ సూపరింటెండెంట్ సీట్‌లో కూర్చోబోయే ముందు వచ్చిపడిం దీ ఆపరేషన్!

"ఎలా ఉందండీ, శర్మగారూ! పాపం, కన్నుకేదో అయిందిట?"

ఎవరు? వాసుదేవరావు! ఎలా వచ్చాడు? కొంపదీసి దెయ్యమయి వచ్చాడా?

"మీరు . . . మీరు . . ."

"అదేమిటండీ వింత మనిషిని చూసినట్లు అలా ఆశ్చర్యపోతారేమిటి? అలా వణుకుతారెందుకు? నేను వాసుదేవరావుని. జ్వరం తగ్గిపోయింది. ఇవాళే పథ్యం మెతుకులు నోట్లో వేసుకున్నాను. ఇక ఆ మంచంమీద పడుకోలేక లేచి వచ్చేశాను. కాస్త కాఫీ ఏదైనా తెచ్చిపెట్టమంటారా?"

"వద్దు. ఏం వద్దు. కాఫీగీఫీ ఏం అక్కర్లేదు."

"అంత తడబడతారు దేనికండీ! భలేవారే! మనలో మనకి మొహమాటం దేనికి?"

"మొహమాటం కాదు. నాకది లేదు."

"సరే! నే వస్తాను. ఇన్నాళ్ళూ సెలవులో ఉన్నానా? పనిఅంతా పేరుకుపోయింది. రేపు వస్తాను. ఏం కావాలన్నా అడగండి. ఒకరికొకరం ఆమాత్రం సాయం చేసుకోటంలో తప్పులేదు. నాకు కాస్త జ్వరంవస్తే మీరు నా ఇంటిచుట్టూ తిరగలా! మీ కింత ఆపరేషన్ అవుతూంటే నేను రాకుండా ఉంటానా?"

కదిలి పోయాడు వాసుదేవరావు. అతడు ముందుకు సాగుతూంటే అతని నల్లని నీడ అంతకంతకు పొడుగై నా మంచమంతా ఆవరించుకుపోయింది. ★

విశ్రాంతి

ఫోటో—ఎ. విశ్వనాథ్ (మద్రాసు–4)

